క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన మదర్ థెరిసా రూరల్ అండ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ, షందాసనీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక యడ్ల లింగయ్య కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లను గురువారం పంపిణీ చేశారు. అలానే పాఠశాలకు కుర్చీలు, డస్టర్లను అందజేశారు. మల్లికార్జున రావు, షేక్ మౌలాలి, ప్రవీణ్‌పాల్, గోవింద్, షేక్ రేష్మ, నఫర్‌జహ, జగన్నాథరావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపిక



తెనాలి: స్థానిక ఎన్నార్ఐ డిగ్రీ కాలేజి ఫైనలియర్ డిగ్రీ విద్యార్థులు ఇటీవల జరిగిన జాబ్ మేళాలో 65 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కాలేజీ సీఈవో సీహెచ్ ఉమా మహేశ్వరరావు తెలియజేశారు. డిగ్రీ పూర్తవగానే ఉద్యోగాల్లో స్థిరపడాలనేది తమ సంకల్పమని, ఆ ప్రకారం తమ అధ్యాపక బృందం ప్రణాళికబద్ధంగా శిక్షణనిస్తున్నామని తెలిపారు. వీరితోపాటు కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.లాజర్‌బాబు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

వామపక్ష ఉద్యమనేత డీఎస్‌ఎన్ ఆకస్మిక మృతి



తెనాలి: పట్టణానికి చెందిన పోస్టల్ ఉద్యోగుల సంఘ నేత, వామపక్ష ఉద్యమకారుడు దేవిరెడ్డి శివనాగేశ్వరరావు (64) గురువారం సాయంత్రం ఆకస్మికంగా మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. డీఎస్‌ఎన్‌గా చిరపరిచితుడైన శివనాగేశ్వరరావు స్వస్థలం పొన్నూరు దగ్గర్లోని పాండ్రపడు గ్రామం. తెనాలిలో స్థిరపడి పోస్టల్ సొసైటీ సీఈవోగా, పోస్టల్ యూనియన్‌తో పోస్టల్ ఉద్యోగులకు సేవలను అందించిన మానవతావాది. మరో వైపు వామపక్ష ఉద్యమాలకు తోడ్పాటునిస్తూ వచ్చారు. స్థానిక ప్రధాన పోస్టాఫీసు దగ్గర్లో యూనియన్ కార్యాలయం పైభాగంలో ఆయన నివసిస్తున్నారు. సమాచారం తెలియగానే వివిధ ప్రజాసంఘాలు, అభ్యుదయ సంఘాల నేతలు నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ



తెనాలిరూరల్: పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీని పట్టణంలో గురువారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి శివాజీ చౌక్‌వరకు జరిగిన ర్యాలీని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం



తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు, తెనాలి మండల ప్రెసిడెంట్ కర్లపూడి బుల్లియ్య, ఓబీసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గుర్రప్ప ద్వారకా శ్రీనివాస్, పెనుగొండ శివకుమార్, భీమా రమేష్, టి. శివన్నారాయణ, రాయప్ప, శంకరరావు, కె.వీరాస్వామి, బి. శ్రీను, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

210 మందికి వైద్యపరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. 210 మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, వంటి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఎంఎల్ హెచ్‌పీ స్వప్న, ఏఎన్‌ఎం ఆంథోనిరాణి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బేస్‌మెంట్‌కే పరిమితమా?

ఎవరికి ఏ ఆపద వచ్చినా తామున్నామంటూ పరుగు పరుగునా వచ్చి వెన్నుదన్నుగా నిలబడి వారికి స్వాంతన కలిగించే వారిలో అగ్నిమాపక సిబ్బంది ముందుంటారు. అటువంటి సేవలందించే సిబ్బందికే తెనాలిలో అవస్థలు తప్పడం లేదు. వారి విధుల నిర్వహణకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రారంభించిన భవన నిర్మాణం నిధుల మంజూరు కాక బేస్‌మెంట్ స్థాయిలో ఆగిపోయింది.

- నిలచిపోయిన అగ్నిమాపక కార్యాలయ నిర్మాణం
- బిల్లులు మంజూరుకాక ఏళ్ల తరబడి ముందుకు కదలని వైనం
- ఇరుకు కార్యాలయంలోనే అవస్థలు పడుతున్న సిబ్బంది



బేస్‌మెంట్‌తోనే నిలచిపోయిన కార్యాలయ నిర్మాణం

తెనాలిరూరల్: సమస్యల చీకట్లో కొట్టుమిట్టాడుతున్న తెనాలిలోని అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అరకొర సిబ్బంది, అత్తెసరు నిధుల కేటాయింపులు వంటి సమస్యలు రగులుకుని ఏళ్లు గడుస్తున్నా, 'ఆర్పే' నాథుడే లేడు. అధునాతన భవనాన్ని నిర్మించేందుకు పనులు చేపట్టినా, బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా పనులు ఆగిపోయాయి. ఇప్పటికి ఏడేళ్లవుతున్నా వాటి గురించి పట్టించుకునే వాడే లేడు.

2018లో ప్రారంభమైన నిర్మాణ పనులు

ఇరుకు కార్యాలయంలో సిబ్బంది వెతల గురించి పదే పదే అర్జీలు వస్తుండడంతో ఉన్నతాధికారులు తెనాలిలో నూతన కార్యాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జీ ప్లస్ టూ విధానంలో రెండంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు నిర్ణయించారు. ఇందుకు సుమారు రూ. కోటి వ్యయం అవుతుందని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు అంచనా వేసి, మంజూరు చేశారు. గుంటూరుకు చెందిన కాంట్రాక్టరు పనులను దక్కించుకున్నారు. 2018లో పనులనూ ప్రారంభించారు. పునాదులకు సంబంధించి సుమారు రూ. 22 లక్షల పనులు చేశారు. అప్పట్లో బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టరు పనులను వదిలేసి వెళ్లారు. తెనాలిలో సిబ్బంది మాత్రం సమస్యలతోనే సహజీవనం చేస్తున్నారు.

ఒకటే శకటం..

సిబ్బంది కొరత కారణంగా తెనాలి అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నారు. మంగళగిరి, పొన్నూరు, బాపట్ల ఏరియాల్లో భారీ ప్రమాదాలు జరిగినపుడు తెనాలి వాహనాన్ని పంపుతుండటం సహజం. అంతే కాక ఏడు మండలాలు తెనాలి కార్యాలయ పరిధిలో ఉన్నాయి. రెండు శకటాల్లో ఒక దాన్ని రవాణా శాఖ అధికారులు పరిశీలించి, పనికి రాదని తేల్చి చెప్పారు.

ఉన్న ఒక్క వాహనాన్ని వినియోగిస్తున్నారు. ఇక ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తే సిబ్బంది నిస్సహాయులమంటూ చేతులెత్తేయాల్సిన పరిస్థితి. ప్రస్తుత వేసవి సీజనులో అగ్నిప్రమాదాలకు ఆస్కారం అధికంగా ఉన్నందున ఇలాంటి సమస్యలు తరచూ ఎదురయే అవకాశాన్ని ఎవరూ కాదనలేరు.

అరకొర వసతులు

ఉన్న సిబ్బందికీ వసతులు అరకొరగానే ఉన్నాయి. ఎప్పుడో స్వాతంత్ర్యం రాక ముందు నిర్మించిన కార్యాలయాన్ని ఇప్పటికీ అలాగే వినియోగిస్తున్నారు. ఇప్పటికీ సిబ్బంది ఉండేందుకు గది లేదంటే అతిశయోక్తి కాదు. 76 ఏళ్ల క్రితం నిర్మించిన గదిలో కేవలం నలుగురుకన్నా ఎక్కువ మంది సిబ్బంది కూర్చునే వీలు లేదు. ఇక వర్షం కురిసిందంటే ఈ గది తటాకాన్ని తలపిస్తుంది. శ్లాబు నుంచి నీరు కుండపోతగా కారుతుంది. అయినా వీరి సమస్యల గురించి పట్టించుకున్న నాథుడు లేడు..

ముందస్తు సంక్రాంతి



పట్టణ చెంచుపేటలోని భాష్యం స్కూల్ చిన్నారులు గురువారం సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. స్కూలు ఎదుట భోగి మంట వేసి, చుట్టూ పాటలు పాడుతూ సందడి చేశారు. – తెనాలి

ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందెబాల చంద్రమౌళి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ స్థానిక రెవిన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దారు జి.సిద్ధార్థ చేతులు మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం పురస్కరించుకుని క్యాలెండర్ ఆవిష్కరించటం సంతోషకరమన్నారు. ముఖ్యంగా క్యాలెండర్‌లో ప్రభుత్వ సెలవులు, ఐచ్ఛికసెలవులు రూపొందించడం వలన ఉద్యోగులందరికీ ఉపయోగపడుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు వంకదార సుబ్బారావు, కార్యదర్శి తిప్పారెడ్డి, మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జి.పూర్ణప్రసాద్, జాయింట్ సెక్రటరీ నూకవరపు శ్రీలక్ష్మి, డిప్యూటీ తహసీల్దారు ఉప్పాల రాజేష్, ఆర్ఐ వంశీకృష్ణా, జూనియర్ అసిస్టెంట్ బి.కిరణ్, వీఆర్‌వోలు షేక్ బాషా, భాస్కర్, ప్రకాష్, కిరణ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొల్లిపర: పంచాయతీ రాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కొచ్చర్ల



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

హైమావతి ఆధ్వర్యంలో ఘనంగా ఏపీ పంచాయతీ రాజ్ శాఖకు చెందిన నూతన క్యాలెండర్‌ను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వి.విజయలక్ష్మి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ప్రతాపరెడ్డి, ఈవోపీఆర్డీ సి.హెచ్. భార్గవ, సీనియర్ సహాయకులు బి.శ్రీనివాసరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన రాజకీయనేత అన్నాబత్తుని

- కౌన్సిలర్‌గా ఆరంభించి మంత్రిగా ఎదిగిన రైతుబిడ్డ
- మాజీ మంత్రి సత్యనారాయణకు నివాళి అర్పించిన వైఎస్సార్ సీపీ ప్రముఖులు

తెనాలి: రాష్ట్ర మాజీమంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ విలువలతో కూడిన పాతతరం నాయకుడనీ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి అంబటి రాంబాబు అన్నారు. మాజీమంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ 33వ వర్ధంతిని గురువారం స్థానిక ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అక్కడి సత్యనారాయణ నిలువెత్తు చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీమంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాజీమంత్రి అంబటి మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ జీవితాన్ని ఆరంభించిన సత్యనారాయణ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగారని గుర్తుచేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావుకు సన్నిహితంగా మెలిగిన సత్యనారాయణ తెనాలి ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. అలాంటి నాయకులు అరుదుగానే ఉంటారని చెబుతూ ప్రస్తుతం ఆయన తనయుడు అన్నాబత్తుని శివకుమార్ వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యేగా చేశారని, తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ, కౌన్సిలర్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన సత్యనారాయణ, మంత్రిగా రాష్ట్ర ప్రజల హృదయాల్లో చెరగని స్థానాన్ని సాధించారని చెప్పారు. ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన రాజకీయ నేతగా గుర్తింపును పొందారని చెబుతూ తాను విద్యార్థి నాయకుడుగా ఉన్న రోజుల్లోనే ఆయన తనకు తెలుసునన్నారు. ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్, తండ్రికి తగిన తనయుడు అనిపించుకోవటం విశేషమన్నారు. భవిష్యత్‌లో ఆయన సేవలు రాష్ట్రానికి విస్తరిస్తాయని అన్నారు. మాజీమంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున తన



అన్నాబత్తుని సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించిన అంబటి రాంబాబు, అన్నాబత్తుని శివకుమార్, మేరుగ నాగార్జున, లేళ్ల అప్పిరెడ్డి ప్రభృతులు

ప్రసంగంలో, సత్యనారాయణను రైతుపక్షపాతిగా చెప్పారు. డెల్టా ప్రాంతంలోని సమస్యలపై తానున్నానంటూ కండువా భుజాన వేసుకుని వచ్చేవారని ఎవరిని అడిగినా చెబుతారన్నారు. ఆయన తనయుడు శివకుమార్ కూడా తెనాలి రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే మద్దెడ్డి శివరామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, నిమ్మకాలయ రాజనారాయణ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఆయన పెద్దకుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ స్వాగతం పలికారు.

సమాధి వద్ద ఘననివాళి

తెనాలి: రైతుబిడ్డగా జన్మించి రైస్‌మిల్లర్‌గా రాజకీయాల్లో ప్రవేశించి రాష్ట్ర మంత్రిగా ఎదిగి, తెనాలి ప్రాంత అభివృద్ధికి తనదైన ముద్రవేసిన అన్నాబత్తుని సత్యనారాయణ 33వ వర్ధంతి సందర్భంగా గురువారం ఘననివాళి అర్పించారు. అనంతరం ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, డిగ్రీ, ఫార్మసీ కాలేజిల అధ్యాపకులు కలిసి ప్రదర్శనగా జయప్రకాష్‌నగర్‌లోని మాజీమంత్రి సత్యనారాయణ సమాధిని సందర్శించుకున్నారు. అన్నాబత్తుని సోదరులు శ్రావణ్‌కుమార్-జయలక్ష్మి, శివకుమార్-పుష్ప దంపతులు, శివకుమార్ కుమారులు



సమాధిస్థలి వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న అన్నాబత్తుని శివకుమార్, శ్రావణ్‌కుమార్

సత్యనారాయణ, అఖిల్‌గణేష్, కుటుంబసభ్యులు సత్యనారాయణ సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.

19 నుంచి అయోధ్య బాలరాముని ప్రతిష్ట వార్షికోత్సవం

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని ఆంధ్రవాల్మీకి శ్రీవాసుదాసస్వామి, దాసశేషస్వామి గురుపరంపర పీఠం శ్రీకోదండరామ సేవక ధర్మ సమాజం (దాసకుటి) ఆధ్వర్యంలో అయోధ్య బాలరాముని ప్రతిష్ట వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. హిందూ ఐక్యవేదిక సహకారంతో నిర్వహిస్తున్న వేడుకల వివరాలను దాసుకుటి అధ్యక్షుడు ఉలిచి సీతారామశర్మ గురువారం వివరించారు. హిందూ ఐక్యవేదిక, వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులతో కలిసి వార్షికోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట జరిగి, ఏడాది పూర్తికావస్తోంది. చీరాలకు చెందిన డాక్టర్ అన్నదానం చిదంబరశాస్త్రి బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠకు వాడిన యంత్రాన్ని, ఏళ్లతరబడి తొమ్మిది కోట్ల మంత్రాలతో పూజించారు. విగ్రహ ప్రతిష్టకు తోడ్కొనివెళుతూ ఆ యంత్రాన్ని 2023 అక్టోబరులో ఊరేగింపుగా దాసకుటి సమాజానికి తీసుకువచ్చారు. ఆ తర్వాత అయోధ్యలో బాలరాముడి విగ్రహం కింద యంత్రాన్ని ఏర్పాటుచేసినట్టు వివరించారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగిన దాసకుటి ఆధ్వర్యంలో అయోధ్య బాలరాముని ప్రతిష్ట వార్షికోత్సవాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 19న తెనాలి పట్టణంలో శ్రీసీతారామస్వామి



బ్రోచర్ ఆవిష్కరించిన సీతారామశర్మ, హిందూ ఐక్యవేదిక నాయకులు

గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. 22వ తేదీన అంగలకుదురులోని దాసకుటిలో శ్రీసీతారామస్వామి కల్యాణాన్ని సామూహికంగా జరుపుతారు. అలాగే 26వ తేదీన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి వ్రతాన్ని సామూహికంగా నిర్వహిస్తామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి అవ్వారు శ్రీనివాసరావు, హిందూ చైతన్యవేదిక రాష్ట్ర సహాధ్యక్షుడు అంబటి మారుతిరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు పుల్లగంటి శ్రీనివాస్, వీహెచ్‌పీ, తెనాలి నగర కార్యదర్శి నందికంటి రామాంజనేయులు, బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు కడియాల నందకిశోర్, భజరంగ్‌దళ్ తెనాలి పట్టణ అధ్యక్షుడు బాలాజి, కనగాల హరిప్రసాద్, సరిపూడి తాతారావు పాల్గొన్నారు.

ఏపీలో పర్సంటేజీ పద్ధతి అమలు చేయాలి

తెనాలిరూరల్: తెలంగాణాలో ఆగస్టు 2 నుండి సినిమాల ప్రదర్శనకు థియేటర్లలో పర్సంటేజీ పద్ధతి ఆచరణలోకి వచ్చిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే పద్ధతిని అమలు చేయాలని 'మా-ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా కోరా రు. స్థానిక 'మా-ఏపీ' 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో మాదిరిగా థియేటర్లకు అద్దె చెల్లించకుండా పర్సంటేజీ పద్ధతి వలన చిన్న సినిమా నిర్మాతలకు ఎంతో ఉపయోగమన్నారు. దీని వలన చిన్న సినిమాలు విడుదలకు నోచుకుంటాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. భారత దేశంలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లకు పర్సంటేజీ విధానంలో షేర్ వస్తుందని ఆయన వివరించారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

తెనాలిరూరల్: పొన్నూరు మండలం మాచవరం గ్రామం దళితవాడలో గత నెల 26వ తేదీన రెండు వర్గాల మధ్య జరిగిన పరస్పర దాడుల నేపథ్యంలో వాస్తవాలను పరిశీలించకుండా న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై ఎస్ఐ రాజకుమార్ దాడి చేయటాన్ని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణ ఆక్షేపణ వ్యక్తం చేశారు. పరీక్షలు చేయించగా ప్రకాశరావు మద్యం సేవించలేదని తేలినప్పటికీ ఎస్ఐ, సీఐ, పోలీసులు అక్రమంగా అతనిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారని ఆరోపించారు. ప్రకాశరావు పై డాక్టర్ ఫిరోజ్‌ఖాన్, ఎస్ఐలు పెట్టిన అక్రమ కేసులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దాడిని ప్రోత్సహించిన సీఐ రవి కిరణ్, ఎస్ఐ రాజకుమార్, మిగిలిన ముగ్గురు పోలీసులపై కేసు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కేఎన్‌పీఎస్ కృష్ణ, న్యాయవాదులు

గురువారం తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, అన్నం పిన్నారావు, గుమ్మడి రవిరాజ్, కేసీ బసవయ్య, కుల నిర్మూలన పోరాట సమితి సభ్యులు ఉన్నారు.

నేటి నుంచి సంగీత మహోత్సవాలు

తెనాలి: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా పట్టణానికి చెందిన సంగీత జగద్గురు సేవాసమితి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సంగీత కార్యక్రమాలను నిర్వహించనున్నారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కళావేదికపై ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల ఆహ్వాన పత్రికను గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. తొలిరోజైన శుక్రవారం సాయంత్రం 6-6.30 గంటల మధ్య బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మచే ముక్కోటి విశిష్టతపై ప్రవచనం ఉంటుంది. ఆ తర్వాత శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందంచే భక్తి రంజని నిర్వహిస్తారు. రెండోరోజైన శనివారం సాయంత్రం 6:30కు పెనుమూడి భార్గవ నాగ యశస్వి చే శాస్త్రీయ సంగీత కచేరి జరుగుతుందని తెలిపారు. వయోలిన్‌పై హేమాద్రి చంద్రకాంత్, మృదంగంపై కానూరు వెంకట రామకృష్ణ వాయిద్య సహకారం అందిస్తారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రామకృష్ణ

చివరిరోజు సాయంత్రం 6.30కు శ్రీరామలింగేశ్వర భక్తి సమాజంచే భక్తిరంజన ఉంటుంది. పెరవలి వంశీకృష్ణ తబలాపై, పెద్దిరాజు, వెంకటేశ్వరరావు కీబోర్డుపై సహకారం అందిస్తారని సంస్థ నిర్వాహకుడు కానూరు వెంకట రామకృష్ణ, శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు వివరించారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

తెనాలి: గుంటూరు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ యూత్, ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు జరిగారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా సంఘాల నాయకులు కొప్పురావూరి హరికిషోర్, రఘునాథమూర్తి, సింగంశెట్టి శ్రీనివాస్, బింగుమళ్ల పృథ్వి, గ్రంధి సీతారామ్, జగదీష్, తాళ్లూరి హేమరామకృష్ణ, త్రిపురమల్లు అమరేంద్ర కుమార్, నాళం రజనీకుమార్, కనమర్లపూడి శ్రీనివాస్, అప్పల అనిల్‌కుమార్, మద్దు లక్ష్మీనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి రూరల్ పరిధిలోని పెదవడ్లపూడిలో నివాసముండే ఓ విద్యార్థి పాఠశాలకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం పెదవడ్లపూడికి చెందిన కేతావత్ విష్ణు నాయక్ స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడని, నెల 8వ తేదీ పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదని, జరిగిన ఈ సంఘటనపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, ఎవరైనా విద్యార్థి ఆచూకీ తెలిస్తే 8688831363, 9441749434, 9032555353 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ వెంకట్ తెలియజేశారు.

వేర్వేరు చోట్ల ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

తెనాలిరూరల్: పట్టణ నందులపేటలోని మాంటిస్సోరి కిండర్ గార్డెన్ స్కూల్లో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. రాంవల్లులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి స్కూల్ ప్రిన్సిపల్ జేమ్ మొరెలి ఆశీర్వదించారు. సంక్రాంతి పండుగ విశిష్టతను చిన్నారులకు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ విజయ, రేఖ, శారద, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

తెనాలి: గుంటూరు జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ యూత్, ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు జరిగారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా సంఘాల నాయకులు కొప్పురావూరి హరికిషోర్, రఘునాథమూర్తి, సింగంశెట్టి శ్రీనివాస్, బింగుమళ్ల పృథ్వి, గ్రంధి సీతారామ్, జగదీష్, తాళ్లూరి హేమరామకృష్ణ, త్రిపురమల్లు అమరేంద్రకుమార్, నాళం రజనీకుమార్, కనమర్లపూడి శ్రీనివాస్, అప్పల అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.



సంక్రాంతి సంబరాల్లో ఉపాధ్యాయిలు, చిన్నారులు



బహుమతులు అందుకున్న విజేతలతో నిర్వాహకులు